క్లుప్తంగా

లక్ష్మీనృసింహ స్వామికి విశేష పూజలు



లక్ష్మీనృసింహ స్వామి పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సీతానగరం: మండలకేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వేంచేసిన లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో గురువారం స్వామిని చామంతి పూలతో అలంకరంచి విశేష పూజలు నిర్వమించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ ఆలయంలో ప్రతి గురువారం వేకువ జామునుంచే నిర్వహించే పూజా కార్యక్రమానికి మండలంలోని పలుగ్రామాల నుంచి, సాలూరు, మక్కువ, బొబ్బిలి, పార్వతీపురం ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు రావడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆలయానికి అతి చేరువలో ఉన్న సువర్ణముఖినదిలో స్నానాలు చేసి పూజా సామగ్రితో వచ్చి పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లిస్తారని తెలియజేశారు.

తాళ్లబురిడి జెడ్పీ పాఠశాల తనిఖీ



పాఠశాలలో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ జగన్నాథ రావు

పార్వతీపురం టౌన్: మండలంలోని తాళ్లబురిడి జెడ్పీ పాఠశాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథ రావు గురువారం తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణంలో పరిశుభ్రత, వంటగది, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల విద్యా ప్రమాణాలు ఈ సందర్భంగా పరిశీలించారు. విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పౌష్టికాహారం అందాలని, రానున్నది పరీక్షా కాలం దృష్ట్యా విద్యార్థులకు చక్కటి తర్ఫీదు ఇవ్వాలని, ఒత్తిడి లేకుండా తీర్చిదిద్దాలని కోరారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు అవసరం



గ్రామసభలో మాట్లాడుతున్న కార్యదర్శి

పార్వతీపురం: గ్రామాభివృద్ధికి ప్రణాళికలు అవసరమని వెంకంపేట గ్రామ సర్పంచ్ తీళ్ల కృష్ణారావు అన్నారు. ఈ మేరకు గురువారం గ్రామ సచివాలయంలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను ముందస్తుగా తయారుచేసుకోవాలని కోరారు. ముందస్తు ప్రణాళికలకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ సిద్ధా జగన్నాథరావు, సచివాలయ కార్యదర్శి, ప్రజలు పాల్గొన్నారు.

గరిష్ట వేతనం పొందేలా పనులు చేయాలి

మక్కువ: గరిష్ట వేతనం రూ.257 పొందేలా వేతనదారులు ఉపాధి పనులు చేపట్టాలని ఎంపీడీవో దేవకుమార్ అన్నారు. మండలంలోని కొయ్యానపేట, కాశీపట్నం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేతనదారులు పనివేళలను సక్రమంగా పాటించాలని సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉంచాలని ఉపాధి సిబ్బందికి స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో ఎస్.ఈశ్వరమ్మ, టీఏ, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలో పాల్గొన్న యువతులు

రాజాం సిటీ: భీష్మ ఏకాదశి సందర్భంగా మండలంలోని బొద్దాం గ్రామంలో గురువారం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. రామాలయ కమిటీ, గోవిందస్వామి మేలుకొలుపు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో యువతులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని, వివిధ రంగవల్లులతో ఆకట్టుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

గృహ సారథులకు ప్రత్యేక శిక్షణ

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల పరిధిలో ఇటీవల సచివాలయం కన్వీనర్లను నియమించారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ప్రతి వలంటీర్ పరిధిలో ఇద్దరు గృహ సారథులను నియమించిన సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో పురపాలక సంఘంలో గల 15 వార్డుల సచివాలయాల పరిధిలో 30 మంది గృహ సారథులను నియమించారు. గురువారం మొదటి విడతగా జగన్నాథపురం, కొత్తవలస-టౌన్ ప్రాంతాలలో గల 8 వార్డు సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు గృహ సారథులతో కలిసి మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించి వారికి భవిష్యత్ కార్యాచరణపై తర్ఫీదు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన వార్డు సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులకు ప్రభుత్వం ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. ఈనెల 11వ తేదీన నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా ప్రారంభం కానున్న 'మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమం ద్వారా గృహ సారథులు అంతా సచివాలయం కన్వీనర్లు, వలంటీర్ల సహాయంతో తమ పరిధిలో గల ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వారికి వివరించి గత ప్రభుత్వం మోసం చేసిన విధానం, ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి గురించి వారికి వివరించి వారి అనుమతితో డోర్ స్టిక్కర్, మొబైల్ స్టిక్కర్ అంటించే బాధ్యత మీరంతా తీసుకుని పార్టీని ప్రజలకు మరింత చేరువచేయాల్సిన బాధ్యత మీతో పాటు మనందరిపై ఉందని ఎమ్మెల్యే అన్నారు.

అంతా సమష్టిగా పనిచేయాలి

కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి మాట్లాడుతూ ఎమ్మెల్యే నాయకత్వంలో పార్టీ నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు గృహసారథులు, కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు అంతా సమష్టిగా కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. మున్సిపల్



ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్ పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, వివిధ వార్డుల కౌన్సిలర్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సచివాలయం కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఈ నెల 4న మండలంలో శిక్షణ తరగతులు

పార్వతీపురం మండలం పరిధిలో మొత్తం 20 సచివాలయాలు ఉండగా అందులో మొదటి విడతగా 10 సచివాలయాల పరిధిలోని గృహసారథులు, వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లతో శనివారం 4వ తేదీన ప్రత్యేక శిక్షణ కార్యక్రమం వెంకంపేట వై జంక్షన్ వద్ద నిర్వహిస్తామని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. గురువారం తన క్యాంప్ కార్యాలయంలో 20 సచివాలయాల కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఈ విషయాన్ని తెలియచేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జావేద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: నిరంతరం మనల్ని అన్నివిధాలుగా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వానికి గృహసారథులే పట్టుకొమ్మలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎవరికీ లభించని గౌరవం వలంటీర్లకు దక్కిందని అలాంటి మీరంతా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ఆశయాన్ని నెరవేర్చేలా ప్రజల్లో జగనన్నకు మరింత ఆదరణ పెంచేలా కృషి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరిక్షిత్‌రాజు

చేయాలని పిలుపునిచ్చారు. అలానే పార్టీగొంతు ప్రతి కుటుంబానికి వినిపించే బాధ్యత గృహ సారథులపై ఉందని పార్టీ ఉద్దేశాన్ని ప్రజలకు చేరవేయాలని కోరారు. మీరు, మేము అంతా కలిసి ఒక కుటుంబంలా కష్టపడి కృషిచేసి వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

తు.చ తప్పకుండా హామీల అమలు

కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశానుసారం నూతనంగా నియమించుకున్న గృహ సారథులకు ముందుగా అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాడు ఏవైతే ప్రజలకు హామీఇచ్చారో వాటిని తు.చ తప్పకుండా అమలు పరిచారని, రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. గృహ సారథులుగా సీఎం జగనన్న చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సవివరంగా తెలియజేసి, మన ప్రభుత్వానికి గత ప్రభుత్వానికి గల వ్యత్యాసాన్ని సవివరంగా తెలపాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వి.నాగేశ్వరరావు, ఎంపీపీ బలగ రమణమ్మ, జెడ్పీటీసీ మామిడి బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, జేసీఎస్ మండలకన్వీనర్ యు.సురేష్, డీసీసీబీ డైరెక్టర్ కృష్ణంనాయుడు, సీనియర్ నాయకులు పి ఈశ్వరనారాయణ, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్‌లు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి విద్యార్థినికి అస్వస్థత

సీతానగరం: మండలంలోని నీలకంఠాపురం గ్రామానికి చెందిన విద్యార్థిని పురుగుమందు తాగి అస్వస్థతకు గురైంది. వివరాలిలా ఉన్నాయి. వెంకటాపురం పంచాయతీ నీలకంఠాపురం గ్రామానికి చెందిన చీకటి మనీష బొబ్బిలిలోని ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతోంది. తనకు చదువంటే ఇష్టం లేదని కాలేజీలో చేరిన నాటి నుంచి అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. చదువుపై ఆసక్తిలేదని ఇంట్లో చెప్పలేక భయంతో పురుగుమందు తాగి ఆత్మాయత్నానికి పాల్పడింది. తమ కుమార్తె ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి అపస్మాకర స్థితికి చేరుకున్న గుర్తించిన తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం మాహరాజా అస్పత్రికి రిఫర్ చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ సుభాష్

పాచిపెంట: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను పార్వతీపురం డీఎస్పీ సుభాష్ గురువారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు త్వరితగతిన పరిష్కరించాలని ఎస్సై వెంకటరమణను ఈ సందర్భంగా ఆదేశించారు. అనంతరం ఆంధ్రా-ఒడిశా సరిహద్దు పి.కోనవలస చెక్‌పోస్ట్‌ను సందర్శించి అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కొలతలతో పనిచేస్తే వేతనం గిట్టుబాటు



మస్తరు వెరిఫికేషన్ చేస్తున్న ఏపీఓ నాగలక్ష్మి

సీతానగరం: మండలంలో ఉపాధి హామీ పనులు చేపట్టడానికి ముందస్తు కొలతల ఆధారంగా వేతనదారులు పనులు చేసి రూ.257 వేతనం గిట్టుబాటయ్యే విధంగా క్షేత్ర సహాయకులు చర్యలు చేపట్టాలని ఏపీఓ నాగలక్ష్మి అన్నారు. లచ్చయ్యపేట, కాశీపేట, బళ్లకృష్ణాపురం చినభోగిలి గ్రామాల్లో జరుగుతున్న పనులను, ఆన్‌లైన్ మస్టర్ విధానాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ముందుగా చెరువుల్లో చేస్తున్న మార్కింగ్, వేతనం ఎలా గిట్టుబాటవుతుందనే అంశంపై వేతనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉపాధి పనులు చేపట్టడానికి ముందస్తుగా వేతనదారులు కొలతలు వేసుకుని పనులను చేయాలని, సమయ పాలన పాటించాలని, కొలతల వారీగా సక్రమంగా పనులు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. గ్రామసభల్లో గుర్తించిన పనుల్లో భాగంగా జాబ్ కార్డులున్న వేతన దారులందరికీ క్షేత్ర సహాయకులు ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. మండలంలోని గ్రామాల్లో గురువారం 3,800 మంది వేతనదారులు ఉపాధి పనుల్లో పాల్గొన్నారని తెలియజేశారు. క్షేత్ర సహాయకులు పనికల్పించిన చోట వేతనదారులకు మార్కింగ్ చేసి పనుల్లో చురుగ్గా పాల్గొనేలా కృషి చేయాలని సూచించారు.

అర్హులందరికీ భూ హక్కు పత్రాలు అందిస్తాం

- డిప్యూటీ కలెక్టర్ కె.వెంకటేశ్వరరావు



కొర్లవలసలో రైతులతో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు

రేగిడి: ఇనాం భూములకు సంబంధించి, మండలంలోని కొర్లవలస గ్రామంలో అర్హులైన ప్రతీ రైతుకు భూహక్కు పత్రాలు అందజేస్తామని డిప్యూటీ కలెక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం గ్రామంలోని రైతులతో సమావేశమైన ఆయన ఇనాం భూముల సాగు వివరాలపై ఆరాతీశారు. ఈ క్రమంలో 826.74 ఎకరాల్లో 611 మంది రైతులు పంటలు సాగు చేస్తున్నారని తెలిసింది. వీటికి సంబంధించి, ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలు ఇప్పుడు జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా చేసే భూముల రీసర్వేతో పరిష్కారమవుతోందన్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులతో ఈ సమావేశమైనట్లు ఆయన పేర్కొన్నారు. భూములు సాగు చేసే రైతులంతా వారి వద్ద ఉన్న హక్కు పత్రాలను వారం రోజుల్లోగా తహసీల్దార్ కార్యాలయానికి అందజేయాలన్నారు. వాటిని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి, సర్పంచ్ బి.చంద్రశేఖర్, అడ్వకేట్ ఐ.శ్రీరాములునాయుడు, ఎంపీటీసీ బి. హరనాథరావు, వీఆర్‌ఓ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

రూ.12.50 లక్షలతో కోల్డ్ స్టోరేజి నిర్మాణం



గొడౌన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: మండల కేంద్రంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న గొడౌన్‌ను ఎంపీపీ ఉత్తరావెల్లి సురేషముఖర్జీ గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఇదేచోట మరో రూ.12.50 లక్షలతో కోల్డ్ స్టోరేజి భవనం నిర్మిస్తామని తెలిపారు. దాదాపు రూ.కోటి వ్యయంతో చేస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవనం నిర్మాణం పూర్తికావచ్చిందన్నారు. మండల పరిషత్ కార్యాలయానికి కొత్త భవనాలు మంజూరు చేయాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ల ద్వారా ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించామన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ ఎల్.త్రినాథ్, రైతు ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షుడు జి.రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై వేణుగోపాలుడు



బొబ్బిలి పురవీధుల్లో అశ్వవాహనంపై ఊరేగుతున్న వేణుగోపాలుడు

బొబ్బిలి: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి గురువారం రాత్రి పట్టణంలోని భక్తులకు కనువిందు చేశారు. స్వామివారు అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రథసప్తమి నుంచి రోజుకో వాహనంపై స్వామి వారు ఊరేగుతారని పురోహితులు తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న ఎంఈఓ దుర్గారావు

వంగర: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని ఎంఈఓ వై.దుర్గారావు సూచించారు. గురువారం మండలంలోని కొప్పరవలస ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడి సిబ్బంది, విద్యార్థుల హాజరు రికార్డులతో పాటు జగనన్న గోరుముద్ద పథకం అమలుతీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాసామర్థ్యాలను వివిధ ప్రశ్నల ద్వారా అడిగితెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనూష పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వర స్వామి కల్యాణం



రామలింగేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

రాజాం: ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని, పట్టణంలోని కూరాకుల వీధిలో రామలింగేశ్వర స్వామి కల్యాణం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఎం.హరగోపాల్‌శర్మ, జీసీసీ ఎండీ జి.సురేష్‌కుమార్, బి.వంశీకృష్ణ, వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలు చెప్పడంలో తండ్రిని మించిన లోకేశ్

- యువగళంతో టీడీపీ భూ స్థాపితం ఖాయం
- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, పక్కన ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: యువగళం పేరుతో నారా లోకేశ్ చేపట్టిన పాదయాత్రతో టీడీపీ భూస్థాపితం కావడం ఖాయమని, అబద్ధాలు చెప్పడంలో తండ్రిని మించిపోయాడని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలో ఓ ప్రవేట్ కార్యక్రమానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుతో కలిసి గురువారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ అమెరికాలో యువశగీతాలు పాడిన లోకేశ్ ఇప్పుడు యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు, ప్రజలకు ఏమి చేస్తారో చెప్పి యాత్ర చేస్తే బాగుంటుందన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి యువతను, రుణమాఫీ చేయకుండా రైతులను చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుచేసి లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రామభద్రపురం నుంచి పార్వతీపురం మన్యం జిల్లా వరకు ఉన్న రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా గుర్తించేలా కృషి చేయాలని డిప్యూటీ సీఎంకు ఎమ్మెల్యే శంబంగి విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, ఆరికతోట సర్పంచ్, ఎంపీటీసీ ప్రతినిధి పెంకి భీమయ్య, పెంకిశేఖర్, శివుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు త్వరగా వసూలు చేయండి



ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ

బలిజిపేట: పంచాయతీ పరిధిలో ఇంటి పన్ను వసూళ్లు మార్చి నెలాఖరుకు పూర్తిచేయాలని ఈఓపీఆర్‌డీ రవికుమార్ ఆదేశించారు. బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటిపన్ను రూ.26,25,025కావాల్సి ఉండగా ఇప్పటికి రూ.15,93,684మాత్రమే వసూలైందని మిగిలిన బకాయిలను సత్వరమే వసూలు చేయాలని తెలిపారు. అదేవిధంగా నాన్‌టాక్స్‌కు సంబంధించి రూ.1,07,606 వసూలు కావాల్సి ఉండగా రూ.65,133 వసూలైందని మిగిలిన మొత్తాన్ని వసూలు చేయాలని తెలిపారు. ఇంటిపన్ను, నాన్‌టాక్స్ త్వరగా వసూలు చేయడం వల్ల పంచాయతీకి నిధులు సమకూరుతాయన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన ర్యాలీ



బందలుప్పిలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



గంగాడలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

బలిజిపేట: లెప్రసీ పక్షోత్సవాల్లో భాగంగా స్పర్శ కార్యక్రమంపై మండలంలోని గంగాడలో గలావిల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్పర్శలేని మచ్చ కుష్ఠువ్యాధి కావచ్చు. కుష్ఠువ్యాధి పూర్తిగా బహుళ ఔషధ చికిత్సతో నయమవుతుంది, కుష్ఠువ్యాధి బాధితులను సమాజంనుంచి దూరంగా వెలివేయకుండా ఉంచాలి. ఎటువంటి మచ్చలు ఉన్నా వెంటనే పరీక్ష చేయించుకోవాలి, మందులు ఉచితంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా అందిస్తామని నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో గలావిల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీలు, చిలకలపల్లి జీఎంఎల్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన అవసరం

పార్వతీపురం: కుష్ఠ వ్యాధిపై ప్రజలకు అవగాహన అవసరమని బందలుప్పి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.శ్రీకాంత్ అన్నారు. గురువారం మండలంలోని బందలుప్పి గ్రామంలో కుష్ఠువ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు సచివాలయం పరిధిలోని గ్రామస్తుల్లో కుష్ఠ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి సరైన మందులు అందిస్తామన్నారు,. కార్యక్రమంలో ఏంపీహెచ్‌ఈఓ బొత్స శ్రీరామలునాయుడు, సిబ్బంది బలరామనాయుడు, లక్ష్మి. వెంకటరమణ, ఆశ వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.